# వొక ద్రవ చైతన్య వుద్యమ కారుని తెగువ

—ఆంద్రేవ్ వల్లూరి రాఘువిస్కీ

1995 జనవరి 18—ఒక వూరు.

వొక్క దెబ్బకి వంద ముక్కలైంది బీరు సీసా!

యాదిరెడ్డి సన్నటి గురకలాటి నవ్వోటి నవ్వాడు. మజ్జనిషేదవంట మజ్జనిషేదం.

యింట్లో మగనాకొడుకిని కాసుకోలేని ఆడనంజలు రోడ్డెక్కి నాలుక్కేకలేసే సరికి మంచి గుర్తొచ్చేసింది మహా పెబువులకి. ఛీ దీనవ్వ. కడుపు రగిలిపోతున్నాది "రేయ్ కోర్టర్ బి.పి. గోల్ట్" అరిచాడు.

బార్ షట్టర్లు దించేస్తున్నారు వర్కర్లు. రోజు రకరకాల కబుర్లతో బాధలతో ఆనందాలతో భూలోక స్వర్గ నరకంలా వుండే యాదగిరి బారు బావురుమం టోంది. రేపటినుంచి ఇదే గతి.

మెంటలు.. మెంటల్ హాస్పిలా



గుంది. "తాగుడు లేని ప్రెపంచవటిరా బాబు! ఎవడి దూల ఆడిది. అనలీళ్ళెవర్రా తాగొద్దంటానికి" ఆవేదనగా అరిచాడు యాదిరెడ్డి.

కోటిరెడ్డి కుయ్‌కయి మనకుండా చూస్తున్నాడు యాదిరెడ్డి జాతరని...

"వారే తెగావేశపడిపోకు. దేన్దారి దానిదే. మనికి మందు దొరక్కుండా వుంటాదీ?"

"మన సంగతి కాదశే! రేపిట్నుంచీ ఏటమ్ముకుని బతకాలి? సీకులా సింతాయలా?" మళ్ళీ అరిచాడు.

"వోరి కంగారెక్కువారే నీకు... బ్రాందీలో పుట్టావా బ్రాందీలో పెరిగావా? ఇదిగ్గాప్తోతే రివిలెస్టేటు బిగినెస్సు! వోరి డబ్బులుండాలే గానీ సిందులేయించీమా జనాన్ని!" సమాధానపరిచాడు

"బావోరే! మందు సెంటిమెంటురా! దెబ్బతీసీకు. ఇకే బిగినెసులో ఇంత నొక్కగలం.." మళ్ళీ అరిచాడు యాదిరెడ్డి.

కోటిరెడ్డికి అరికాలు మంట నెత్తికెక్కింది. "రోజులతోపాటు మారప్తోతే మటాషోరే!" అంటూ "వుచ్చోసుకొస్తా" అని బార్ వెనక తలుపు తీసుకుని అట్నించటే వెళ్ళిపోయాడు.

యాదిరెడ్డికి తల్లి తాళి తెగినంత బాధ. ఎంత తాగినా ఎక్కనే ఎక్కదాయె!

'యెలాగైనా దీన్ని ఎత్తించీయాల. మందు నేకపోతే పెజల భవిషెత్తే నేదు' అనుకుంటూ ఆలోచిస్తూ టేబుల్ మీదే వొరిగిపోయాడు.

## 1997 జనవరి 18
## —అదే వూరు.

"మజ్జనిషేధం ఎత్తేస్తే సయించేది నేదు. ఆడంగులు పాణాలకొగ్గి సాదించిన విజీమిది. దీనిమీద మావు మా పార్టీ ఆందోళన చేస్తాదంతే" యాదిరెడ్డి ఆవేశంగా అరిచాడు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో.

"గతంలో మీకు లిక్కర్ బిజినెస్ వుండేదనుకుంటా?" అడిగాడో విలేకరి.

"జా! కానీ పాపం పున్నెం ఎరిగి సొచ్చెందంగా మానీసినాం! మందు డబ్బు మాకొద్దు. పరివొర్తన ముక్కెం! అందుకే బాందీ యవ్వారాలు మానీసినాం! అయినా వో సంగతి సెప్పండి. మనిసి మారడం మీన మీ ప్రెస్సోళ్ళకి నమ్మకం నేనట్టుందే. గతంలో బాందీ యాపారం చేసినోడే ఈయాల ఈ యాపారానికి చెలవు చెప్పేసిన వొయినం వార్తగానీ... నా గత జీయితం వార్తా? కాస్స సూచుకుని అడగాలి పెత్నలు" అన్నాడు గంభీరంగా యాదిరెడ్డి.

"రేపో మాపో మద్యనిషేధం ఎత్తేయ్యచ్చని అంటున్నారు. ఎత్తేస్తే మీ పార్టీ ఏం చేస్తుంది?" అడిగాడు మరో విలేకరి.

"పాణాలు.. పాణాలు వొగ్గేసయినా సరే మళ్ళీ మజ్జనిషేధం ఎట్టించేస్తాం! ఆడంగులంతా మా ఎంటే వున్నారు" ఆవేశంగా అరిచాడు యాదిరెడ్డి.

రొండోరోజు పేపర్లో యాదిరెడ్డి హెచ్చరిక ప్రముఖంగా ప్రచురితమైంది. రాష్ట్రవ్యాప్తంగా యాదిరెడ్డి జనం "మజ్జనిషేధం ఎత్తీసీకూడదని, పెద్దెత్తున ఆందోళనకి దిగిపోతునారని" దాని సారాంశం.

* * *

కోటిరెడ్డి అడిగాడు.

"బాబోరే అప్పుడు మజ్జనిషేధం తప్పనీసినావు. వద్దనీసినావు. ఇప్పుడేటిరా ఈ ఈరంగం.? ఇంతకీ నిజంగా మారిపోనావేటి? మొత్తానికి మారిపోయి బానే సంపాదించీసినావు. రివిలెస్టేట్ బిగినెస్‌కి నాను సెప్పినట్టు దిగిపోనావేటి?" అడిగాడు గ్లాసు కిందపెడుతూ!

"వోరూకోస్! మనవేటి మారడవేటిసే వెనకటికి లయిసెన్సు ఫీజులని అయని ఇయని నచ్చలు నచ్చలు కట్టి బాందీ యాపారం నడిపాం. ఇప్పుడదేటి నేదు. నారీ కింతని చెక్‌పోస్టుకి కట్టీస్తాం. పక్క రాష్ట్రాలనుంచి మందు దింపీసుకుంటాం! మన కుర్రాళ్ళని పెట్టి బాటిలు నాల్గొందలకి అమ్మిస్తాం! ఎవిడి వాటా ఆడిది. వెనకటికన్నా ఎప్పుడే బిగినెస్సు బాగుంది. పెతీ వూళ్లో మనోళ్లు ఏపీగా వున్నారు. కేసులు మనవే రాయించేస్తాం. ఎక్సయిజోళ్ళకి రిసుకుండదు. నెలకొచ్చేసరికి నాలుగురెట్లు నాబం. ఎనకటి రోజుల్లో ఏటుంది దిబ్బ? అంతా పోటీ బిగినెస్సే! ఎప్పుడు? చేసుకున్నోడికి చేసుకున్నంత నాబం! ఇంకెందుకేటి మజ్జనిషేధం ఎత్తీసేది?"

పెద్ద పెగ్గు గుటుక్కుమనిపించి కింగ్ వెలిగించాడు యాదిరెడ్డి!

"వింకోమాట పెద్ద సోతంత్ర సమరయోధులు, ఆడంగులు ఈళ్ళందరూ మనకి సపోర్టు! మరి సిఎం ఏటి చేసేగలడు? పబ్లికు సెంటిమెంటు! వుంకో మాటొరే బావా!! మీ వూల్లో మజ్జనిషేధం ఎత్తీకూడదని ఆందోళన పెట్టించేశావనుకో! నీకూ అందులో పాల్గొన్నోళ్ళకి పైనాన్సు సేసీస్తాను. ఈయాల రేపు అమ్మే దమ్ముండాలే గానీ పుజ్జమాలని కూడా మార్కెటు చేసీవచ్చు. అసలు పుజ్జమాలున్నదే బిగినెసు కోసం.

నా మాటిని ఈ టైపు ఏజిటేషను ఎట్టించు, నీకు వర్కవుటవుద్ది! సంగ గౌరవం ఫ్రీగా వచ్చేస్తాది!" బ్రేవ్‌మని తేన్చి జీడిపప్పు పకోడి ముక్క నవులుతూ తృప్తిగా వెనక్కి వాలాడు యాదిరెడ్డి.

కోటిరెడ్డికి తాగింది దిగిపోయి వెర్రెత్తినట్టు చూశాడు యాదిగాడికేసి!

చివరి పెగ్గు తాగుతూ 'అవురా! ఏదొచ్చినా మన మంచికే అనేది విందుకేనేమో' అనుకుంటూ గ్లాసు కింద పెట్టి గోడమీద గాంధీబొమ్మకేసి జాలిగా చూశాడు కోటిరెడ్డి.



